క్లుప్తంగా

పాండుకు మదర్ థెరిసా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



విప్పర్తి ఐజక్ న్యూటన్ పాండు

నిడదవోలు రూరల్: విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు విప్పర్తి ఐజక్ న్యూటన్‌పాండు మదర్ థెరిసా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ సామాజికవేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ కన్వెన్షన్ సెంటర్లో డిసెంబర్ 7న నిర్వహించే సేవారత్న-సంఘమిత్ర జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో తాను అవార్డు స్వీకరిస్తానని శనివారం ఆయన తెలిపారు.

రేపు వికలాంగులకు బస్ పాస్‌లు

నల్లజర్ల: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని కవులూరు, నబీపేట గ్రామ సచివాలయాల వద్ద దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందించనున్నట్టు ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి ఆదివారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కవులూరు గ్రామ సచివాలయం వద్ద, మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ నబీపేట గ్రామ సచివాలయం వద్ద బస్‌పాస్‌లు పంపిణీ చేస్తామన్నారు. ఆయా గ్రామాల దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బస్‌పాస్‌లు పొందాలన్నారు. అభ్యర్థులు తమ వెంట సదరం, ఆధార్ సర్టిఫికెట్ జిరాక్సులతో పాటు రూ.3,100 నగదు తీసుకు రావాలన్నారు.

గాయపరిచిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామంలో కాటూరి వెంకటేష్ అనే వ్యక్తిని దుర్భాషలాడి బీర్ బాటిల్‌తో కొట్టినట్టు అందిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన మారి, ఫణి అనే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. నిందితులు ఇరువురూ ఆదివారం మధ్యాహ్నం వెంకటేష్‌ను దుర్భాషలాడి, అతడితో గొడవ పడ్డారు.అనంతరం ఇరువురూ వెంకటేష్ ఇంటికి వెళ్లి అతడిని బీరు బాటిల్‌తో కొట్టి గాయపరిచారు. కింద పడవేసి కొట్టారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

ధమ్మ పీఠాధిపతి తల్లిదండ్రులకు సన్మానం



ఉండ్రాజవరం ధమ్మ పీఠంలో షేక్ బాజ్జీ, షేక్ మస్తాన్ బీబీలను సత్కరిస్తున్న అనాలియో, ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: తల్లిదండ్రులుగానే కాకుండా, పెంచి, తీర్చిదిద్దిన తన తల్లిదండ్రులు షేక్ బాజ్జీ, షేక్ మస్తాన్‌బీబీల శేష జీవితం సుఖసంతోషలతో సాగాలని స్థానిక బౌద్ధ ధమ్మ పీఠాధిపతి బంతె అనాలియో ఆకాంక్షించారు. అనాలియో తండ్రి షేక్ బాజ్జీకి 60 ఏళ్లు నిండిన సందర్భంగా షష్ఠి పూర్తి, టీచర్‌గా పదవీ విరమణ చేసిన తల్లి షేక్ మస్తాన్ బీబీలకు సన్మానం నిర్వహించారు. ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆజంటను పద్యాలు, కవితలతో ప్రశంసించారు. కార్యక్రమంలో అనాలియో కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు కె.మాణిక్యాలరావు, ఐ.రాంబాబు, బి.రామారావు, పి.కుసుమ, ఉషశ్రీ, అహల్య, తదితరులు పాల్గొన్నారు.

కళ్లాల్లోనే ధాన్యం.. రైతు కళ్లల్లో దైన్యం

- అకాల వర్షంతో అన్నదాతల కలవరం
- రైస్ మిల్లులకు ధాన్యం తరలింపుపై అధికారుల దృష్టి



తాళ్లపూడి మండలం అన్నదేవరపేట వద్ద రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాధిక



దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద ధాన్యాన్ని మిల్లుకు తరలించే ఏర్పాటు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కొవ్వూరు: అకాల వర్షంతో అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. దీంతో అన్నదాతలు కలత చెందుతున్నారు. ఒక వైపు ముమ్మరంగా వరికోతలు సాగుతున్నాయి. ఇలాంటి తరుణంలో కురుస్తున్న ఆకాల వర్షంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను ఒబ్బిడి చేసుకునే పనుల్లో వారు బిజీ అయ్యారు. ఇప్పటికే కొంతమేర వరికోతలు పూర్తయ్యాయి. డివిజన్ వ్యాప్తంగా ఇంకా రైతుల వద్ద 48,690 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం కాకపోవడంతో రైతులు హైవేలు, రోడ్లపైన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. 1,384 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే నిల్వ ఉన్నట్టు అధికారులు లెక్కలు తేల్చారు. తుపాను ప్రభావంతో భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. పంట కోత దశలో ఉన్నప్పుడు గాలులు వీస్తే పైరు నేలకు ఒరిగిపోయే ప్రమాదం ఉంది. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కొవ్వూరు డివిజన్‌లోని అధికారుల అప్రమత్తం అయ్యారు. కళ్లాల్లో, రోడ్లపైన ఆరబోసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారు. ఆదివారం ఒక్కరోజులోనే డివిజన్ వ్యాప్తంగా 750 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు తరలించామని చెబుతున్నారు.

25,004 హెక్టార్లలో కోతలు పూర్తి

కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా 37,144 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు జరిగింది. ఇంత వరకూ 25,004 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. మరో 12,170 హెక్టార్లలో పంట కోత కోయాల్సి ఉంది. ఇప్పటి వరకూ కోతలు పూర్తయిన ఏరియా ద్వారా 1,65,435 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. దీనిలో రైతులు ఓపెన్ మార్కెట్‌లో 5,430.2 మెట్రిక్ టన్నులు విక్రయించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 1,11,315 మెట్రిక్ టన్ను లు సేకరించారు. ఈ లెక్కన మొత్తంగా 1,16,745.2 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటికీ 48,690 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు వద్ద ఉంది. దీనిలో కొంత మేరకు ఓపెన్ మార్కెట్‌కు విక్రయించినా ఎక్కువ మేర ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులు విక్రయించుకోవాల్సి ఉంది. వాటిలో 1,384 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది.

కళ్లాల్లోనే ధాన్యం

మండలాల వారీగా డివిజన్‌లోని తాళ్లపూడిలో గరిష్టంగా 410 మెట్రిక్ టన్నులు, గోపాలపురంలో 310, కొవ్వూరులో 180, ఉండ్రాజవరంలో 100, పెరవలిలో 150, నిడదవోలులో 85, నల్లజర్లలో 80, చాగల్లులో 11 మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం పొలాల్లోనే ఉందని అధికారులు గుర్తించారు. ఆదివారం అయినప్పటికీ కూడా అధికారులు చొరవ చూపి, కొంత మేర ధాన్యాన్ని మిల్లులకు తరలించారు.

కొవ్వూరు డివిజన్‌లో వరి పంట వివరాలు

మొత్తం ఆయకట్టు	-37,144 హెక్టార్లు
కోతలు పూర్తయిన ఆయకట్టు	-25,004 హెక్టార్లు
ఇంకా కోతలు పూర్తి చేయాల్సిన ఏరియా	-12,170 హెక్టార్లు
ఇంత వరకూ వచ్చిన దిగుబడి	-1,65,435 మెట్రిక్ టన్నులు
ఓపెన్ మార్కెట్‌లో అమ్మిన ధాన్యం	-5,430.2 మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం	-1,11,315 మెట్రిక్ టన్నులు
ఇంకా సేకరించాల్సిన ధాన్యం	-48,690 మెట్రిక్ టన్నులు
కళ్లాల్లో ఉన్న ధాన్యం	-1385 మెట్రిక్

కోతలు నిలిపివేయాలని ఆదేశించాం



వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను తాత్కాలికంగా నిలిపివేయాలని రైతులకు సూచిస్తున్నాం. డివిజన్‌లో 1,384 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో ఉన్నట్లు గుర్తించాం.ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని రైతులకు సూచించాం. మండల శాఖ అధికారులను అప్రమత్తం చేశాం.ఇప్పటికే కోతలు పూర్తి చేసుకుని రైతుల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

-సీహెచ్ చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

ఎయిడ్స్ రోగుల పట్ల సేవాభావంతో మెలగాలి

మంత్రి కందుల దుర్గేష్



తిమ్మరాజుపాలెంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: సమాజంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని ఆదివారం తిమ్మరాజుపాలెంలోని లయన్స్ వృద్ధాశ్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఆత్మవిశ్వాసంతో సరైన మందులు వాడాలని సూచించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన మండలశాఖ అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, నాయకులు బండి సత్యనారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఆర్‌జీ కేర్ సెంటర్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో 25 మంది ఎయిడ్స్ బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం పౌష్టికాహారం అందజేశారు. ఎయిడ్స్ బాధితుల కోసం లయన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు జేష్ఠ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బండి రాంగోపాల్, డాక్టర్ జానకీప్రియ, డి.సీతారత్నం, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వూరులో అవగాహన ర్యాలీ



కొవ్వూరులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

కొవ్వూరు: వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ఆదివారం పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ప్లకార్డులు, బ్యానర్స్ పట్టుకుని ర్యాలీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సాయికిరణ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత, వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం, దుప్పట్ల పంపిణీ

నల్లజర్ల: స్థానిక అంబేడ్కర్ యూత్ సభ్యులు తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో 30 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల చిన్నారులకు పౌష్టికాహార ప్యాకెట్లు, దుప్పట్లు అందజేశారు. ఏఆర్‌టీ సెంటర్ డాక్టరు వరప్రసాద్ వివిధ అంశాలపై రోగులకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో మల్లిపూడి రాజారావు, గారపాటి సురేష్, తాడిగడప వెంకట్రావు, శ్రీపాద ప్రకాష్, కె.దుర్గారావు,వైఆర్‌జీ కేర్ ఆర్గనైజేషన్ సీసీఎఫ్ కె.ప్రశాంతి పాల్గొన్నారు.

ఉద్యోగిగా ఎందరి మనసులు గెలిచామన్నదే ముఖ్యం



కోన వెంకట వేణు దంపతులను సన్మానించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పెరవలి: ప్రభుత్వోద్యోగిగా ఎంతకాలం పని చేశామన్నది ముఖ్యం కాదని, ఎందరి మనసులు గెలుచుకున్నామన్నదే ముఖ్యమని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పని చేసిన కోన వెంకట వేణు ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం నిర్వహించిన వేణు వీడ్కోలు,సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేణు దంపతులను ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో వెంకట వేణు అందించిన సేవలను ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌తో పాటు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తమ ప్రసంగాల్లో కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి షష్ఠి మహోత్సవాలు

దేవరపల్లి: స్థానిక వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవాలు ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తారు. ఇందుకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 4న స్వామి వారికి భక్తులచే పాలకావిడి సేవ జరుగుతుంది. 5న స్వామి వారికి అభిషేకాలు, 6న స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం 6 గంటల నుంచి కల్యాణం జరుగుతుంది. 7, 8 తేదీల్లో పలు రకాల పూజలు, మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం జరుగుతాయి.13వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఆలయం వద్ద భక్తుల సహకారంతో అన్నసమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

మెట్ట ప్రాంతంలో జోరు వాన



దేవరపల్లిలో కురుస్తున్న వాన

దేవరపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మెట్ట ప్రాంతంలో రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో చలిగాలుల తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి మెట్ట ప్రాంతంలోని పలు గ్రామాల్లో జోరు వాన కురుస్తోంది. వర్షానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిచేల కోతలు నిలుపుదల చేశారు. రోడ్లపై గల ధాన్యం రాశులపై బరకాలు కప్పి తడవ కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ పలు గ్రామాల్లో రోడ్లపై గల ధాన్యం రాశుల అడుగు భాగంలో నీరు చేరడంతో ధాన్యం తడిసినట్టు రైతులు వివరించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ మద్దతు ధరకు రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిడదవోలు రూరల్: ఫెంగల్ తుపాను ప్రభావంతో పట్టణంతో పాటు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. వర్షాలకు చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ మాసూళ్లు ఇంకా పూర్తికాకపోవడంతో సమిశ్రగూడెం, కలవచర్ల, డి.ముప్పవరం తదితర గ్రామాల్లో ధాన్యం తడవకుండా రైతులు రాశులపై బరకాలు కప్పారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో గోతులు పెరిగి పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షం ప్రభావంతో వివిధ గ్రామాల్లో కార్తిక వనసమారాధనలను వాయిదా వేసుకున్నారు.

వృద్ధాశ్రమంలో రేకుల షెడ్డు ప్రారంభం



రేకులషెడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మానవత సంస్థ సభ్యులు

నిడదవోలు: పట్టణంలోని కైలాసభూమి వద్ద చర్ల సుశీల వృద్ధాశ్రమంలో నిర్మించిన రేకులషెడ్డును ఆదివారం ప్రారంభించారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో దాత పెనుగొండ వెంకటేశ్వరరావు సమకూర్చిన రూ.50 వేల ఆర్థిక సాయంతో ఈ షెడ్డు నిర్మించారు. అనంతరం సింగవరం బ్రాంచ్ పోస్టుమాస్టర్ సఖినిశెట్టి సీతామహాలక్ష్మి, కృష్ణమూర్తి దంపతుల ఆర్థిక సాయంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ నిడదవోలు శాఖ అధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు, కార్యదర్శి ముళ్లపూడి సోమరాజు, కోశాధికారి పెనుగొండ సుబ్బారావు, కె.గంగరాజు, తన్నీడి బోసు, కొప్పుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వండి

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామ శివార్లలోని ఎస్సీ శ్మశానవాటికను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పరిశీలించారు. ఈ శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించడంతో పాటు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు భీమడోలు కిరణ్‌కుమార్ మాదిగ మంత్రి దుర్గేష్‌ను కోరారు. శ్మశానవాటికకు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను మంత్రి దుర్గేష్ ఆదేశించారు. జనసేన పట్టణశాఖ అధ్యక్షుడు రంగా రమేష్, స్థానికులు భీమడోలు శ్రీను, జయరాజు, వినయ్‌కుమార్, వీర్రాజు, చదలవాడ వెంకటేష్, గణేశ్ పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న క్వారీ లారీ

నలుగురికి స్వల్ప గాయాలు



యర్నగూడెం గండి చెరువు వద్ద కారును ఢీ కొన్న క్వారీ లారీ

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గండి చెరువు వద్ద పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం నుంచి నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన నలుగురు వ్యక్తులు వివాహ శుభలేఖలు పంచడానికి ఆదివారం ఉదయం కారులో బయలుదేరారు. ద్వారకాతిరుమల వెళ్లి శుభలేఖలు పంచి రాజమహేంద్రవరం వెళుతున్నారు. యర్నగూడెం గండి చెరువు వద్ద పంగిడి నుంచి ఏలూరు వైపు వెళుతున్న క్వారీ లారీ వారి కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. వర్షం కురుస్తున్నందున లారీ అదుపుతప్పి కారును ఢీ కొట్టింది. దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట నష్టపరిహారం అందలేదు

చాగల్లు: కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు కోరారు. చాగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై, ఆగస్టు నెలల్లో సంభవించిన వరదల వల్ల నష్టపోయిన కౌలు రైతులకు ఇంతవరకూ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందలేదన్నారు. అరటి, మినప, మొక్కజొన్న, పెసర, కంద పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో కౌలు రైతులు నష్టాలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. పీఎం కిసాన్ యోజనతో సంబంధం లేకుండా, కౌలు,చిన్న,సన్నకారు రైతులకు పంట రుణాల కింద ఏడాదికి రూ.20 వేల చొప్పున సాయం అందించాలని కోరారు. వేసవిలో భూసార పరీక్షలు చేయించాలని విజ్ఞప్తి చేశారు. మండల కౌలు రైతు సంఘం అధ్యక్షుడు రామనాథ్ మురళీకృష్ణ కూడా ఉన్నారు.

కూటమి పాలనపై వ్యతిరేకత మొదలైంది

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు
- చాగల్లులో పార్టీ మండల శాఖ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

చాగల్లు: గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ, ఐక్యతతో పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు సూచించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం సాయంత్రం చాగల్లు శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మంటపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తలారి వెంకట్రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న అబద్ధాల ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'దాచుకో-దోచుకో' అని చంద్రబాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారని ఆరోపించారు. గతంలో సీఎంగా చంద్రబాబు చేసిన అప్పులకు లెక్కలు లేవన్నారు. జగన్ మోహన్‌రెడ్డి చేసిన అప్పులకు చంద్రబాబు, లోకేష్‌లు తప్పుడు లెక్కలు చూపి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. అధికారం చేపట్టి ఆరు నెలలు అయినప్పటికీ కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడం లేదని తలారి విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్మడు, కుదప రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు, నాయకులు ఉండవల్లి శ్రీనివాస్, గూడపాటి శివ, ఎల్లె నాగేశ్వరరావు, పొన్నాడ సింహాద్రి, గురువెల్లి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాట్ రిక్షా స్టాండ్‌కు స్థలం కేటాయించాలి

నిడదవోలు రూరల్: ప్లాట్ రిక్షా కార్మికుల స్టాండ్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గ్రీష్మకుమార్ డిమాండ్ చేశారు. నిడదవోలు కాపు కల్యాణ మంటపం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్లాట్‌ఫాం రిక్షా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోనేటి మల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పిచ్చా సూర్యకిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

నల్లజర్ల: నల్లజర్ల గ్రామ శివార్లలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5 బైక్‌లు, రూ.4,020 నగదు స్వాధీనం చేసుకొన్నట్టు నల్లజర్ల ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ముగిసిన కార్తిక వన సమారాధనలు



నల్లజర్లలో మాట్లాడుతున్న కాపు సంఘ జిల్లా నాయకుడు మాకా శ్రీనివాస్



దేవరపల్లి మండలం పల్లంట్ల శివాలయం వద్ద కార్తిక వన సమారాధన

నల్లజర్ల: కార్తిక వన సమారాధనలు ఐక్యతకు వేదికలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కాపుసంఘ నాయకుడు మాకా శ్రీనివాస్ అన్నారు. నల్లజర్లలో ఆదివారం సిద్ధివినాయక కాపు సంఘ ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ శ్రేయోభిలాషులుగా కాపు కులస్తులు నిలుస్తారన్నారు. కాపులంతా రాజకీయంగా ఎదగాలన్నారు. అన్నిరంగాలలో ముందుండాలన్నారు. త్వరలో రూ.రెండు కోట్లతో విద్యానిధి ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఈ మొత్తంతో వచ్చే వడ్డీతో ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లలో శిక్షణ పొందే వెనుకబడిన కాపు యువతకు ఆర్థికంగా చేయూత ఇస్తామన్నారు. వన సమారాధనలో మహిళలు, చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి రకరకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నమట్ల సత్య, సోము, కందుల రవిశేఖర్, ఎస్.ప్రసన్నకుమార్,బాడిత నాగేశ్వరరావు, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, అగ్గిరాజు,సెంథిల్‌కుమార్, ఉన్నమట్ల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: పట్టణంలోని వేములూరు దీప్తి స్కూల్ సమీప కొబ్బరి తోటలో ఆదివారం శివానంద మహర్షి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. సభ్యులంతా కలిసి ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పేరాబత్తిన శివప్రసాద్, సభ్యులు యాగంటి చలపతి, చిలంకుర్తి బాబీ, జొన్నలగడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు టింబ్‌హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేములూరు సమీప గెస్ట్‌హౌస్‌లో వన సమారాధన నిర్వహించారు. టింబ్‌హౌస్ ఓనర్స్ కుటుంబ సభ్యులంతా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలు నిర్వహించి బహుతులు అందజేశారు. వ్యాపారవేత్తలను సత్కరించారు.

దేవరపల్లి మండలంలో..

దేవరపల్లి: పల్లంట్లలోని రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక వనసమారాధన జరిగింది. ఉదయం 11 గంటల నుంచి వన సమారాధన ప్రారంభించారు. తొలుత జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొయ్యలమూడి సుధారాణి, చినబాబు దంపతులు ఉసిరిచెట్టు వద్ద లక్ష్మీనారాయణ పూజ చేశారు. గోపూజ, గో ప్రదక్షణ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు వన సమారాధనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. సంఘాధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు (కోటి), గౌరవాధ్యక్షుడు బి.కనకరాజు, కోశాధికారి కె.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.వీరబాబు, ఎన్‌వీవీ దుర్గాప్రసాద్, నాగవరపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.